నవంబర్ - డిసెంబర్, 2010

# స్వర్ణ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక





# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

దేవుని నామములో మీకు నా శుభములు. అంతా బాగున్నారా? ఏ స్థితిలో మనము ఉన్నప్పటికి, పరిస్థితులు ఎలాంటివైనప్పటికి, మనలను సంతోషంగా ఉండమని ప్రోత్సహిస్తున్న మన ప్రభువు ఆత్మస్వరూపియై మనతో ఉండడం మన ధన్యత. బ్రదుకు దినములన్నియు ఆయన కొరకు మనము జీవించవలసిన వారమై యున్నాము. వర్షములు విస్తారముగా పడుతున్నాయని సంతోషించే లోపే కొన్ని ప్రాంతములలో అధిక వర్షముల వలన పంటలు నష్టపోవడం శోచనీయం.

దేవుని వాక్యములో వ్రాయబడినట్లుగా మనము సుఖముగాను, నెమ్మదిగాను బ్రదుకు నిమిత్తము రాజులు, అధికారులు, మనుష్యులందరి కొరకు విజ్ఞాపనలు, ప్రార్థనలు, యాచనలు, కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసిన వారమై యున్నాము. దీని విషయమై మనం జాగ్రత్తగా ఆలోచిస్తే, లోకం విషయమై మనం కలిగియున్న బాధ్యత లేక భారం మనలను, మన కుటుంబములను నెమ్మదిగా, సుఖంగా ఉంచుతుంది. ఈ దినములలో క్రైస్తవులైనవారు సహితము ఆలోచిస్తున్న విధానమును చూచినప్పుడు అధికారులను, ప్రభుత్వములను విమర్శించుటలో ఉన్న శ్రద్ధ ప్రార్థించుటలో కనిపించుట లేదు. ప్రియులైన మీకు నా స్వహస్తములతో వ్రాయునదేమనగా దేవుడు మనకి అనుగ్రహించిన సమాజము గురించి బాధ్యత కలిగి ఉండవలసిందిగా ప్రేమతో కోరుకొనుచున్నాను. ఆ బాధ్యతలు ఏవనగా మనకి ఇవ్వబడిన ప్రభుత్వములు, అధికారులు మరియు ప్రజలందరి కొరకు ఆసక్తితో ప్రార్థన చేయుట, దిక్కులేని వారికి ముఖము త్రిప్పక, మన సామర్థ్యము కొలది మేలు చేయమని మిమ్మును ప్రోత్సహించుచున్నాను. సంవత్సరాంతములో ఏదైనా ఒక మంచి తీర్మానము చేసుకొని, దానిని నెరవేర్చుటానికి కావలసిన శక్తిని ఇవ్వమని దేవుని వేడుకుందాము.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక !

మీ సహోదరుడు.....

నవంబర్ - డిసెంబర్, 2010

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- (దుర్) నీతి ........ 2
- 100 % (నూరుశాతము) ........ 5
- నీకు ఆశీర్వాదము కలుగును గాక (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- ప్రశాంతమైన జీవితము -4వ భాగము ........ 9
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 13వ భాగము ........ 11
- బాబోయ్ పగిలిపోయింది (బాలల శీర్షిక) ........ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 15
- నిజమైన స్నేహితులు ........ 17
- ఆత్మ ఫలము ........ 18
- మార్టిన్ లూథర్-2 ........ 19
- క్రిస్మస్ కానుక ........ 20
- కర్మేలు పర్వతము ........ 21
- బైబిల్ క్విజ్-13 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# (దుర్) నీతి

- ఎడిటర్

నీతి అనే మాటకు అనేకమైన అర్థములను చెప్పుకుంటూ లోకం ముందుకి వెళుతుంది. లోకం నుండి ప్రత్యేకపరచబడ్డాము అని చెప్పుకుంటున్న క్రైస్తవులుగా నీతిని గురించి ఎలాంటి అవగాహన కలిగి ఉన్నాము? మనలో అనేకులు కలిగి ఉన్న అవగాహన, నేను యేసుప్రభువుని నమ్ముకొని త్రాగుడు మానివేశాను, సిగిరెట్లు కాల్చట్లేదు, చెడ్డపనులన్నీ చేయడం విడిచిపెట్టాను అని చెప్పుకుంటూ, సాక్ష్యములు ఇస్తూ ఎంతో మురిసిపోతూ ఉంటారు. ఇవన్నీ మంచివే కానీ, వీటన్నిటి కంటే ఎంతో ఉన్నతమైన స్థాయిలో ఉంది దేవుని నీతి.

**రోమా 3:20**లో వ్రాయబడినట్లుగా **ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు.** ధర్మశాస్త్రసంబంధమైన క్రియల విషయంలో అనేకులు జాగ్రత్త కలిగి ఉండడం సాధారణమైన విషయం. దేవుని నీతి దీనికి భిన్నమైనదిగా మనకి కనబడుచున్నది. **రోమా 10:4** ప్రకారము **విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై, క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు.** ఇచ్చట దేవుని నీతి ఆయన యందలి విశ్వాసము అని మనకి స్పష్టముగా అర్థమవుచున్నది. ఈ సందర్భములో బైబిలు గ్రంథం నందు ఉన్న ఒక వ్యక్తి యొక్క జీవితం చక్కటి ఉదాహరణగా చెప్పుకోవచ్చును. యేసుక్రీస్తు భూమి మీద సేవ చేసిన దినములలో ఒక వ్యక్తి ఆయన యొద్దకు వచ్చి, పరలోకరాజ్యములో ప్రవేశించాలంటే నేను ఏ ఏ నీతి క్రియలు చేయాలి అని అడిగి, ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు బాల్యము నుండి నేను అనుసరిస్తున్నాను అని చెప్పాడు. అప్పుడు ప్రభువు నీకు ఒకటి కొదువగా ఉన్నది, నీ ఆస్థిని అమ్మి, బీదలకిమ్ము అని చెప్పడం జరిగింది. ఆ మాట విని ముఖమును చిన్న బుచ్చుకుని వ్యసనపడుతూ వెళ్ళాడు. ధర్మ శాస్త్రమంతయు నెరవేర్చుచున్న వ్యక్తి విశ్వాస సంబంధ మైన కార్యం విషయంలో వెనకడుగువేసాడు. ఆస్థిని అమ్మి బీదలకు ఇవ్వడం అనేది విశ్వాస సంబంధమైన కార్యము. ధర్మశాస్త్రమునకు వేరుగా దేవుని నీతి బయలు పడు చున్నది, దానికి ధర్మశాస్త్రమును, ప్రవక్తలును సాక్ష్య మిచ్చుచున్నారు. అది యేసుక్రీస్తు నందలి విశ్వాస మూలమైనదై నమ్మువారందరికి కలుగు దేవుని నీతియై యున్నది. **(రోమా 3:21, 22)**



రేపటిని గురించి చింత కలిగి జీవించడం, భవిష్యత్‌ను గురించి ఆందోళనపడడం ఖచ్చితంగా విశ్వాస సంబంధమైన దేవుని నీతికి విరోధమైనది. వీటినే మనం దుర్నీతి అని చెప్పుకోవచ్చును. మన బలహీనతలలో, అపజయములలో మనలను బట్టి మనము క్రుంగిపోవడం దుర్నీతిగా దేవుడు భావిస్తాడు. విశ్వాసమును కనపరచడం దేవుని నీతి అవుతుంది.

**రాహాబు నీతి :-**

**రాహాబు అనే స్త్రీని గురించి బైబిల్ గ్రంథములో వ్రాయబడిన సంగతులను ధ్యానిద్దాము :-**



ఆమె ఒక వేశ్య. సమాజములో ఆమెను గూర్చి మాట్లాడాలన్నా ఇష్టపడని పరిస్థితులు. యెరికో అనే పట్టణ ప్రాకారము మీద నివసిస్తూ ఉండేది. దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులు కానాను దేశ ప్రయాణములో యెరికో పట్టణమును దాటి వెళ్ళవలసి వచ్చింది. ఆ సమయంలో ఆ పట్టణమును చూచి వచ్చుటకు యెహోషువ ఇద్దరు వేగుల వారిని పంపగా, వారిని రాహాబు తన ఇంట చేర్చుకుంది. ఇచ్చట ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వారితో ఆమె చెప్పిన విషయములు మన హృదయములను పులకింపచేస్తాయి.

యెహోషువ 2:9,10 ప్రకారము **యెహోవా ఈ దేశమును మీకిచ్చుచున్నాడనియు, మీ వలన మాకు భయము పుట్టుననియు, మీ భయము వలన మా దేశనివాసులందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును. మీరు ఐగుప్తు దేశము నుండి వచ్చినప్పుడు, మీ యెదుట యెహోవా యెఱ్ఱసముద్రపు నీరు ఏలాగు ఆరిపోచేసెనో, శత్రువుల మీద ఎలా జయము ఇచ్చెనో మేము వింటిమి. వినినప్పుడు మా గుండెలు కరిగిపోయాయి** అని చెబుతున్న రాహాబు మాటలలో ఎంతో విశ్వాసం కనబడుచున్నది. ఆమె కేవలం వేరొకరి ద్వారా విని విశ్వాసంతో అద్భుతమైన మాటలను చెప్పుచున్నది. ఇశ్రాయేలీయులలో అనేకులను మనము చూచినప్పుడు దేవుని కార్యములను కన్నులారా చూచి సహితము మంచి మాటలు తమ నోట పలకలేక పోయారు. మోషే కానానుకు పంపిన 12 మందిలో 10 మంది ఏ మాత్రమూ విశ్వాసమును కనపరచలేకపోయారు. కానీ ఈ స్త్రీని చూచినప్పుడు వీరి కంటే ఎంతో భిన్నమైనదిగా కనబడుచున్నది. అందుకే దేవుడు ఆమెను అవిధేయులతో పాటు నశించిపోనియ్యక రక్షించాడు.

మనుష్యుని జ్ఞానంతో ఆలోచించినప్పుడు కనిపించే నీతి వేరు, దేవుని యొక్క జ్ఞానముతో ఆలోచించినప్పుడు కనిపించే నీతివేరు.

<u>**పేతురు నీతి :-**</u>




పేతురు యేసుప్రభువు శిష్యులలో తొందరపడే వ్యక్తి వలె కనబడుతూ ఉంటాడు. ప్రభువును సిలువ వేయడానికి సైనికులు పట్టుకొని, ఈడ్చుకుంటూ తీసుకొని వెళ్తున్నప్పుడు పేతురు తప్ప మిగిలిన వారంతా పారిపోయినట్లుగా వ్రాయబడి ఉంది. (మత్తయి 26:56) పేతురు మాత్రం ప్రభువు వెంట ఉండగా అక్కడ ఉన్నవారు గుర్తించి, ఇతను కూడా యేసుతో ఉన్నాడు అని అంటుండగా, భయముతో 3 సార్లు అబద్ధం చెప్పిననూ, ప్రభువును మాత్రం విడిచి వెళ్ళడానికి ఇష్టపడలేదు. ఇచ్చట పేతురులో ఆయన మీద ఉన్న విశ్వాసం కనబడుతుంది. అందుకే తరువాత దినములలో పేతురు బలమైన పనివానిగా దేవుని చేతిలో వాడబడ్డాడు.

ప్రియ చదువరీ! నిజమైన దేవుని నీతిని ఇప్పుడైనా అర్థం చేసుకొనగలుగు చున్నావా? మన అనుదిన జీవితములో విశ్వాసముతో ఆలోచించి, నిర్ణయములు తీసుకొని, పనిచేసే వారిగా ఉండాలి. కొన్ని నీతి పద్ధతులను అనుసరించుట కంటే, విశ్వాసమూలమైన నీతితో జీవించుట ఎంతో అవసరమైనది. ఈ దినములలో ఎందరో తాము అనుకునే నీతిలో జీవిస్తూ, దేవుని ఎదుట దుర్నీతిని కనపరుస్తున్నారు. కనుక అట్టి దుర్నీతిని ద్వేషించి, దేవుడు ఉద్దేశించిన నీతిని ప్రేమించు. అప్పుడు దేవుడు నీ దేవుడు నీ తోడివారికంటే నిన్ను హెచ్చించునట్లుగా ఆనందతైలముతో అభిషేకిస్తాడు (హెబ్రీ 1:9)

అట్టి ధన్యత దేవుడు అనుగ్రహించును గాక !

EPAPHRAS MINISTRIES WEB SITE
www.epaphra.org




# నూరుశాతము

రాహుల్ అనే అబ్బాయి, రోజా అనే అమ్మాయి కలిసి ఆడుకుంటూ ఉన్నారు. ఆ అబ్బాయి కొన్ని ఆట బొమ్మలు కలిగి ఉన్నాడు. ఆ అమ్మాయి కొన్ని స్వీట్స్ తన వెంట తెచ్చుకుంది.

**ఆ అబ్బాయి ఆ అమ్మాయికి ఇలా ప్రపోజ్ చేశాడు : –**

నీ దగ్గర ఉన్న స్వీట్స్ నాకిస్తే, నా దగ్గర ఉన్న ఆట బొమ్మలు నీకు ఇస్తాను అన్నాడు. దానికి ఆ అమ్మాయి ఒప్పుకుంది.



ఆ అబ్బాయి తన దగ్గర ఉన్న వాటిలో పెద్దది, అందమైనదైన బొమ్మని ప్రక్కన దాచిపెట్టి, మిగిలినవన్నీ ఆ అమ్మాయికి ఇచ్చాడు. ఆ అమ్మాయి మాత్రం తన దగ్గర ఉన్న స్వీట్స్ అన్నీ ఆ అబ్బాయికి ఇచ్చివేసింది.

ఆ రాత్రి ఆ అమ్మాయి ఎంతో ప్రశాంతంగా నిద్రపోయింది, కానీ ఆ అబ్బాయికి మాత్రం నిద్రపట్టట్లేదు. ఒకటే ఆలోచన, ఆ అమ్మాయి కూడా మంచి స్వీట్స్ దాచుకుందేమో. ఏ విధంగా అయితే తాను చేశాడో, అదే విధంగా ఆమె కూడా చేసిందనే అనుమానము.

మన జీవితంలో కూడా అన్ని విషయములలోను పూర్ణమనస్సుతో వ్యవహరించకపోతే మనుష్యులతో మనకి ఉన్న సంబంధాలు దెబ్బ తింటాయి. మనము కూడా అనుమానపడుతూ ఆ అబ్బాయి వలె ఉంటాము. కాబట్టి నువ్వు చేసే అన్ని విషయములలో 100% చెయ్యి అప్పుడు ప్రశాంతంగా ఉండగలుగుతావు.



# నీకు ఆశీర్వాదము కలుగును గాక !

**- సిస్టర్ విజయ**

**ఆశీర్వాదము కలుగును గాక!** అనే మాట తరచుగా మనము వింటూ ఉంటాము. ఆహ్వాన పత్రికలలో ముఖ్యముగా వివాహ ఆహ్వానములలో మీరు మమ్ములను ఆశీర్వదించండి అని వ్రాసి ఉండుట చూస్తాము. అలవాటుగా వివాహ పత్రికలలో అలా ముద్రిస్తారే కానీ ఒక కుటుంబము ఎలా ఆశీర్వదించబడుతుంది? దానికి మనము ఏం చేయాలి? అనే విషయముల గురించి పెద్దగా పట్టించుకోరు. ఒక విధంగా చూస్తే, తెలుసుకోవాలి అనే అవగాహన కూడా లేనివారు అనేకులు ఉంటారనేది వాస్తవము. చిన్నతనము నుండి మనము సమాజములో జీవించే విధానమును గురించి స్కూల్‌లో కానీ, ఇంటిలో కానీ ఎక్కడా పెద్దగా ప్రస్తావించకపోవడం మనకి తెలుసు. శాస్త్ర జ్ఞానము సంపాదించి దాని ద్వారా ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి అనే దాని మీదే అందరి దృష్టి. అందుకే మాటలు కూడా సరిగా రాకముందే వారి చదువును గురించి ఆతురత. కానీ మన జీవితమునకు అత్యవసరమైనది, అతిముఖ్యమైనది జీవించడానికి కావలసిన సరియైన విధానము.



కొన్ని సంవత్సరముల క్రితం కర్మెలు ప్రాంతంలో ఆస్థిగల ఒక కుటుంబము కాపురముండేది. 3,000 గొర్రెలు, 1000 మేకలు కలిగి ఉండేవారు. (1 సమూ 25:2) అతని భార్య సుబుద్ధి కలిగినది అని అందరూ అనుకుంటూ ఉండేవారు. అతని పేరు నాబాలు, అనగా మూర్ఖుడు అని అర్థము. అతని మందలు పొలములో ఉన్న సమయములలో అతని పనివారికి, దావీదు అతనితో ఉన్నవారు ఎంతో సహాయపడ్డారు. రాత్రింబగళ్ళు వీరి మందకు ప్రాకారముగా ఉండేవారు.

ఒకానొక కష్టసమయములో దావీదు తన పనివారి కొరకు ఆహారం పంపమని, నాబాలుకి కబురు పంపెను. ఆ పనివారు నాబాలు దగ్గరకు వచ్చి, నీకు నీ ఇంటివారికి, నీకు కలిగిన అంతటికి క్షేమము కలుగును గాక అని

పలకరించి వారు వచ్చిన పని గురించి చెప్పడం జరిగింది. అందుకు నాబాలు మీరెవరు ? మీకు ఎందుకు ఆహారం ఇవ్వాలి? అని దుర్మార్గముగా ప్రవర్తించడం జరిగింది. ఇక్కడ మనకి అర్థమవుతున్నది చేసిన మేలుకు కొంచెమైనా కృతజ్ఞత లేకపోగా, తోటివారితో మాట్లాడటం కూడా తెలియని మోటువాడు. ఆహారం అడుగుట కొరకు వచ్చిన దావీదు దాసులు వెళ్ళి సంగతిని దావీదుకి చెప్పడం జరిగింది. అంతట దావీదు తన దాసులతో, మీ కత్తులు ధరించుకొనుడి అని చెప్పి, తాను ఒక కత్తి ధరించుకొనెను. దావీదు వెనుక 400 మంది బయల్దేరడం జరిగింది. ఈ సంగతి నాబాలు పనివారిలో ఒకడు వెళ్ళి, నాబాలు భార్యయైన అబీగయీలుతో ఈ విధంగా చెప్పాడు.

దావీదు అతని మనుష్యులు మనకి ఎంతో మేలు చేశారు. రాత్రింబగళ్ళు వారు మాకు ప్రాకారముగా ఉన్నారు. వారు ఇప్పుడు కీడు చేయడానికి వస్తు న్నారు. కనుక త్వరపడి నీవు చేయవలసిన దానిని గురించి జాగ్రత్తగా ఆలోచించ మన్నాడు. **(1 సమూ 25 :14-17)**



అందుకు అబీగయీలు త్వర పడి 200 రొట్టెలు, 2 ద్రాక్షారసపు తిత్తులు, వండిన 5 గొర్రెల మాం సము, 5 మానికల వేయించిన ధాన్యము, 100 ద్రాక్షగెలలు, 200 అంజూరపు అడలు, దావీదుకి పంపిం చెను (1 సమూ 25 :18). వెనుక వెళ్ళి ఎదురుగా వస్తున్న దావీదుని, అతని మనుష్యులను కలుసుకొని, దావీదుకి సాష్టాంగ నమస్కారము చేసి, అతని పాదములు పట్టుకొని ఈలాగు చెప్పెను.

**1. ఈ దోషము నాదని ఎంచుము (1 సమూ 25 :24) :-**

తన భర్త ప్రవర్తించిన చెడ్డప్రవర్తనకు తాను బాధ్యత వహించెను. ఏదీ దాచుకోకుండా ఉన్నది ఉన్నట్లుగా చెబుతుంది. ఆమెలో ఎలాగైనా కీడు నుండి తాను, తన కుటుంబము రక్షించబడాలనే తపన కనబడుతుంది.

**2. నాబాలుని లక్ష్యపెట్టవద్దు (1 సమూ 25:25) :-**

తన భర్త యొక్క పేరు అతని గుణమును సూచిస్తుందని, మోటుతనము గలవాడని, పనికి మాలిన వాడని ఒప్పుకుంటూ, అతని మాటల వలన కలిగిన గాయమును మాన్పడానికి ప్రయత్నిస్తుంది.

**3. నా తప్పుని క్షమించు (1 సమూ 25:28) :-**

మనం చేసిన తప్పుకి క్షమాపణ అడగడానికి తటపటాయిస్తూ ఉంటాము. కానీ ఈ స్త్రీ తాను చేయని తప్పు కొరకు తన్ను తాను తగ్గించుకొని దావీదు ఎదుట క్షమాపణ కోరుతుంది.

**4. బ్రదుకు దినములన్నియు నీకు మేలు కలుగును గాక! ( 1 సమూ 25:28) :-**

ఆ తప్పుని ఒప్పుకోవడం మాత్రమే కాకుండా మనస్ఫూర్తిగా తన ఎదుటి వారిని దీవిస్తూ తన మంచి మనస్తత్వమును కనపరుస్తుంది.

ఈ మాటలు విని దావీదు, నీవు చూపిన బుద్ధి విషయమై నీకు ఆశీర్వాదము కలుగును గాక! అని దీవించాడు.

ఇచ్చట అబీగయీలు చూపించిన తెగువ ఎంతో అభినందనీయం. నేటి దినములలో కుటుంబములలో ఇలాంటి స్త్రీలు ఎంతో అవసరం. బాధాకరమైన విషయం ఏమిటంటే మంచి బుద్ధితో కుటుంబములను కట్టుకొనవలసిన వారమై యుండగా, అబద్ధములతో తమ భర్తల ఎదుట మెప్పు పొందాలి అనుకునే వారు కనబడుతున్నారు. అబీగయీలు తన భర్త తప్పిదము వలన కుటుంబము నాశనము కాకుండా చూచుకొంది. ప్రియమైన సహోదరీలకు నా మనవి ఏమనగా ఎటువంటి చెడ్డ ప్రవర్తన కలిగిన భర్తలు ఉన్నప్పటికి, అధైర్యపడవద్దు. పిల్లల విషయమై కృంగిపోకండి. మనం సుబుద్ధితో వ్యవహరించడం వలన మన కుటుంబములను ఆశీర్వాదం వైపుకి నడిపించుకోవచ్చు. **ఆశీర్వాదము మీకు కలుగును గాక !**

# ప్రశాంతమైన జీవితము

4వ భాగము

**<u>8. ధ్యానముతో దినము ప్రారంభించుట :-</u>**

ధ్యానం అనే అనుభవం మనలను ఎంతో ప్రశాంతమైన జీవితమును జీవించునట్లు చేస్తుంది. దేవుడు చేసిన మేలులను, ఆయన చూపిన కృపను ధ్యానించుట ద్వారా మన హృదయము ఎల్లప్పుడు దేవునికి సమీపముగా ఉంటుంది. ప్రతి ఉదయ కాలము ధ్యానముతో మన దినచర్యలను ప్రారంభించిన యెడల మనము చేయవలసిన పనులు ఎంతో నైపుణ్యతతో చేయగలుగుతాము. ధ్యానము మనకి కలిగే చెడ్డ తలంపులు, ఆలోచనలను కూడా దూరం చేస్తుంది. మన అనుదిన జీవితములో ధ్యానించుట ఒక భాగమైనప్పుడు మంచి ఫలితములను చూడగలము, శాంతిని పొందగలము. బైబిల్ గ్రంథములో ఇస్సాకు అనే వ్యక్తి ధ్యానం చేసేవాడు అని వ్రాయబడింది. **(ఆది 24:63)**

**<u>9. మనస్సుని ఖాళీగా ఉంచవద్దు :-</u>**

ఖాళీగా ఉండే మనస్సు దయ్యములకు నిలయం అని ఒక తత్త్వవేత్త చెప్పడం జరిగింది. (An empty mind is the devils work shop). మన మనస్సుని ఖాళీగా ఉంచితే ఎన్నో పనికి రాని ఆలోచనలు పుడుతూ ఉంటాయి. ఆ ఆలోచనలు మాటలుగా మారి, మాటలు క్రియలుగా, క్రియలు అలవాటుగా, అలవాట్లు వ్యక్తిత్వముగా, వ్యక్తిత్వం గమ్యమును నిర్దేశిస్తుంది. కనుక అనవసరమైన ఆలోచనలు అనే వాటికి అవకాశమిస్తే అవి మన గమ్యమును మార్చివేయగలవు. మనస్సుని ఖాళీగా ఉంచి, అనవసరమైన ఆలోచనలకు తావివ్వక, మనకి ఇవ్వబడిన బాధ్యతలను గురించి ఆలోచించుకోవడం ద్వారా మంచి నిర్ణయములను తీసుకోవచ్చు. అదే విధంగా మనస్సుని ఖాళీగా ఉండే అవకాశం లేకుండా చేయవచ్చు.

**<u>10. గతం గతః :-</u>**

ఇది వ్యక్తిగత జీవితంలో ఎంతో అవసరమైన లక్షణం. దీనిని వేరొక కోణంలో చూడకూడదు. మనం వ్యక్తిగతంగా గతించిపోయిన దినములు, సంవత్సరములలో తీసుకున్న నిర్ణయముల గురించి, జీవితంలో సంభవించిన సంఘటనల గురించి ఎంతో చింతిస్తూ, వర్తమానము అంతా వ్యర్థము చేసుకుంటూ ఉంటాము. దేవుడు కూడా మన గతమును గురించి ఎప్పుడు ప్రశ్నించడు కానీ వర్తమానంలో ఏ విధంగా ఉన్నామనేది ముఖ్యము. కనుక గతమును గురించిన అనవసరమైన చింతలను విడిచిపెట్టి జరిగిన

తప్పులలో నుండి పాఠములను నేర్చుకొని, ముందుకి వెళ్తే మంచి నిర్ణయములను తీసుకోగలుగుతాము. క్రింది ఉదాహరణ దీని విషయంలో ఎంతో అర్థవంతంగా ఉంటుంది.

ఒక మల్టీ నేషనల్ కంపెని మేనేజింగ్ డైరెక్టర్‌గా ఒక యువకుడిని నియమించడం జరిగింది. అతను రిటైర్డ్ అయిన ఎమ్.డి. దగ్గరకు వెళ్ళి కంపెనీని మంచిగా నడిపించడానికి ఏం చేయాలో, మీ సలహా కావాలి అన్నాడు. అప్పుడు

రిటైర్డ్ ఎమ్.డి – Right Decisions (సరియైన నిర్ణయములు)

క్రొత్త ఎమ్.డి – Thank you sir, Right Decisions ఎలా తీసుకోవాలి?

రిటైర్డ్ ఎమ్.డి – Experience (అనుభవము)

క్రొత్త ఎమ్.డి – అనుభవము ఎలా సంపాదించాలి?

రిటైర్డ్ ఎమ్.డి – Wrong Decisions (తప్పు నిర్ణయముల నుండి)

కాబట్టి గతం మంచి నిర్ణయములకు నాంది కావాలి కానీ గతం భవిష్యత్‌ని నాశనం చేయకూడదు. ప్రశాంతమైన జీవితమును పోగొట్టుకోకూడదు.



**క్రిస్మస్ మరియు**
**నూతన సంవత్సర ఆరాధన**

**క్రిస్మస్ ఆరాధన సమయం:**
డిసెంబర్ 25,
ఉదయం గం. 10.00 లకు

**నూతన సంవత్సర ఆరాధన సమయం:**
డిసెంబర్ 31,
రాత్రి గం. 9.00 లకు

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర



**- సీరియల్ 13వ భాగము**

ఈ కాలంలోనే తనని ఎంతో బాధపరచిన ఉద్రేకముల నుండి విడుదల పొందాడు సుందర్. కీర్తనకారునితో బాటు “శాంతికరమైన జలముల యొద్దకు నన్ను నడిపించు చున్నాడు. నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు” అని చెప్పేస్థితికి చేరాడు సుందర్. తన ఆత్మీయ జీవితంలోని తదుపరి మజిలి బాప్తిస్మం కోసం సుందర్ సిద్ధపడుచున్నాడు. తాను ఏ పాపం చేయకపోయినా, తమ పాపములను ఒప్పుకొనుచూ బాప్తిస్మం పొందడానికి యోహాను దగ్గరకు వస్తున్న వారితో యేసుప్రభువు కూడా వస్తున్న దృశ్యమును సువార్తలు చదివిన ప్రతిసారి చూడగలిగాడు సుందర్. గలిలయుడైన యేసుప్రభువు చేసిన బోధల వలననూ, సూచక క్రియల వలననూ మాత్రమే గాక తన కొరకు కాచుకొని యున్న సిలువకై స్థిరమైన మనస్సుతో, ముందుకు సాగిపోవడం ద్వారా చలించిపోయిన సుందర్ అసమానుడైన క్రీస్తు జీవిత అనుభమును తానూ అనుసరించాడు. క్రీస్తు కొరకు బాధను, లేమిని అనుభవించాలనుకున్నాడు. ఈలోగా సుందర్‌కి 16 ఏండ్లు నిండుకుంటూ ఉన్నాయి. అప్పుడతడు స్వేచ్ఛగా బాప్తిస్మం పొందవచ్చు. బాప్తిస్మం పొందాలన్న తన ఆశను లూథియానా బోర్డింగ్ స్కూలు ప్రధానోపాధ్యాయునికి తేటగా తెలియజేసినప్పుడు ఆయన దానికి తగిన యేర్పాటు చేశాడు. సుందర్‌ని గూర్చి వ్రాస్తూ, అతని పరిస్థితి అంతటిని వివరిస్తూ సిమ్లాలోని చర్చ్ మిషనెరీ సొసైటీలోని రెడ్‌లాండ్ గారికి వ్రాశాడు. రెడ్‌లాండ్‌గారు సుందర్‌ని ఎంతోసేపు ప్రశ్నించారు. విశ్వాసమును గూర్చి సుందర్‌ని అడిగిన ప్రశ్నలన్నిటికి అతడెంతో తేటగాను, నిర్దుష్టంగాను జవాబు చెప్పాడు. యేసుక్రీస్తును గూర్చి ఆయన బోధలను గూర్చి అసాధారణమైన నిర్దుష్టతను, స్పష్టతను కలిగియుండడం సుందర్‌లోని ప్రత్యేకత. అతని దర్శనంలో క్రీస్తే నిండిపోయాడనేది స్పష్టం. బాప్తిస్మం తీసుకోవడానికి సుందర్ సంసిద్ధంగా ఉన్నాడని రెడ్‌లాండ్ నిస్సంకోచంగా తెలియజేయడంతో 1905 సెప్టెంబర్ 3వ తేదీన అంటే సుందర్ 16వ జన్మదినాన్న అతనికి బాప్తిస్మమిచ్చారు. ఈ చివరి కార్యమును కూడ సుందర్ ముగించాడు. అంతకు ముందు తన తలపై వెంట్రుకలను కత్తిరించుకొన్నప్పుడు సిక్కు మతం నుండి, దానికి సంబంధించిన సమస్తం నుండి, తన కుటుంబము నుండి కూడ తెగతెంపులు చేసుకొన్న సుందర్ సిమ్లాలోని పరి. థామస్ గుడిలో బాప్తిస్మం పొందినప్పుడు తాను దేని కొరకు స్థిరంగా నిలబడ్డాడో

దానిని, తన క్రైస్తవ విశ్వాసమును బాహాటంగా వెల్లడించాడు సుందర్. భవిష్యత్తులో ఏం చేయాలో నిర్ణయించుకునేది ఇప్పుడు సుందర్ చేతిలోనే ఉంది. ఓ రకంగా చూస్తే ఆ నిర్ణయం ఎప్పుడో చేశాడు. బాప్తిస్మం పొందిన తరువాత రెడ్‌మాన్ గారితో మాట్లాడుచు తానేం చేయాలో తనకు తెలుసునని సుందర్ చెప్పాడు. తాను సువార్త ప్రకటించాలి, పునరుత్థానుడైన క్రీస్తు తన శిష్యుల కిచ్చిన ఆఖరి ఆజ్ఞలో ఇమిడియున్న ఆ మాట వలన తన హృదయంలో ప్రేరేపించబడిన వాడై తాను చేయవలసిన కార్యం కూడా అదేనన్న నిర్ణయానికి వచ్చాడు. అయితే ఏ పద్ధతిలో దానిని చేయాలనే ప్రశ్న వచ్చింది. భారతదేశంలో ఉన్న పద్ధతి ప్రకారం దానిని మిషనెరీలు స్థాపించిన వేదాంత కళాశాలలో చేరి వేదాంత విద్యనభ్యసించడమా? తాను ఎదుర్కొన్న కష్టదినములలో మిషనెరీలు తనకి ఎంతో సహాయం చేశారు కనుక అలా చేయడం ఎంతో సుళువుగాను, సహజంగాను ఉంటుంది గానీ ఎందుకో వెనుకంజ వేశాడు సుందర్. తల్లి జ్ఞాపకములు అతనిని వెనకకు లాగాయి. నీవు నీ అన్నల వలె లోకస్థుడువైపోయి నిర్లక్ష్యంగా ఉండవద్దు. లోకమును పరిత్యజించి నిజమైన జ్ఞానమార్గమును వెదకడం ఎంతో ఉత్తమం అని తరచుగా చెప్తూ ఉండేది తల్లి. తన గుణగణాలు, ఆశలు రూపొందడంలో తల్లి ప్రభావం ఎంతో ఉన్నది గనుక తాను చేసిన తీర్మానం ఆమె ఆశలకు అనుగుణంగా ఉన్నది.

తాను ఇప్పుడు జ్ఞానమార్గమును వెదకనవసరం లేదు గాని సర్వసంగ పరిత్యాగం చేసినట్లైతే తల్లి మాటలకు అనుగుణంగా నడుచుకొన్నట్లు ఉంటుందనుకున్నాడు సుందర్. సంచార జీవనమును గడుపుచు, భోజనం కోసం ఇతరులపై ఆధారపడుచు, సర్వసంగ పరిత్యాగియైన సాధువు అవుతాడని తనను గూర్చి ఆ వృద్ధ సాధువు తన తల్లితో చెప్పిన మాటలు సుందర్‌కి జ్ఞాపకమొచ్చాయి. అంతే కాకుండా సువార్తలను చదువుతున్నప్పుడు సువార్త ప్రకటించడానికి, రోగులను స్వస్థపరచడానికి యేసుప్రభువు తన శిష్యులను పంపించినప్పుడు తమతో ఏమియు తీసుకొని వెళ్ళవద్దని చెప్పినట్లుగా గమనించాడు. ఎలాంటి ఆర్భాటము లేకుండ ఈ పని చేయాలని నిర్ణయించుకున్నాడు. తాను ఒక సాధువుగా మారిపోతాడు, సాధువుగానే ఒక చోట నుండి మరో చోటికి వెళ్తాడు గాని ఆలయములను, పుణ్యక్షేత్రములను దర్శిస్తు తీర్థయాత్రలు చేయడు. వాక్యమును ప్రకటించడానికి వెళ్తాడు. క్రైస్తవ సాధువుగా జీవిస్తాడు.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)



# బాబోయ్ పగిలిపోయింది

ప్రియమైన పిల్లలూ! ఎలా ఉన్నారు? బాగున్నారా? Christmas Shopping plans వేసుకున్నారా! దేవుడు మన కోసం ఎన్నో gifts ఇచ్చారు. మనం తల్లిదండ్రులకు gifts వంటి వారమైతే వాళ్ళు మనకి దేవుడిచ్చిన gifts. కానీ ఈ రోజులలో పిల్లలు తల్లిదండ్రులను అర్థం చేసుకోవట్లేదు. వాళ్ళు ఎంతో ప్రేమతో పిల్లల అవసరాలు తీరుస్తున్నారు. ఈ ప్రపంచంలో వాళ్ళకి మీరే లోకం. మీరు మాత్రం మీ ఆటలు, friends వీటితో తల్లిదండ్రులను అర్థం చేసుకోరు. అలేఖ్య అనే అమ్మాయి తల్లిదండ్రుల ప్రేమను అర్థం చేసుకోక ఎంతగా భయపడిందో చూద్దామా !

అనూషకు ఆకాశంలోని మెరుపులు చూడడం అంటే ఇష్టము. ఒక రాత్రి కుండపోతగా వర్షం కురుస్తుంది. బాల్కానీలో కూర్చుని లైట్లన్నీ తీసివేసి, వర్షమును, మెరుపులను ఎంతో జాగ్రత్తగా గమనిస్తూ ఉంది. sudden గా gate శబ్దం అయితే అటువైపు చూసింది. ఒక అమ్మాయి వర్షంలో పూర్తిగా తడిచిపోయి ఇటు వైపు లోపలికి రావడం గమనించింది.

అనూష అరుస్తూ అమ్మా! త్వరగా రా అని కేక వేసింది. వాళ్ళ అమ్మ వచ్చి, ఆ తడిచిపోయిన పిల్లను చూస్తూ, దగ్గరకు వెళ్తుంటే, అనూష కూడా వెళ్ళింది. తీరా దగ్గరకి వెళ్ళి చూచేసరికి, అనూష స్నేహితురాలు అలేఖ్య. అనూష ఆశ్చర్యంతో తన స్నేహితురాలిని లోపలికి ఆహ్వానించింది. ఇంతలో వాళ్ళ అమ్మ లోపలి నుండి టవల్ తెచ్చి, అలేఖ్యను తుడుచుకోమని చెప్పింది. అలేఖ్య తన స్నేహితురాలితో “ఇంటి నుండి పారిపోయి వస్తున్నాను. శరీరం అంతా చాలా చలిగా ఉంది” అని చెప్పింది. అనూష వాళ్ళ అమ్మ బట్టలు మార్చుకోమని చెప్పింది. వాళ్ళ నాన్న వేడి వేడిగా సూప్ తీసుకు వచ్చాడు. అలేఖ్య అనూష వాళ్ళ అమ్మా, నాన్నను చూస్తూ సూప్ త్రాగడం పూర్తి చేసింది, ఆమె శరీరం వణకడం ఆగిపోయింది.

అనూష వాళ్ళ అమ్మ ఇద్దరిని rest తీసుకొండి అని చెప్పింది. వారిద్దరూ కలసి అనూష రూమ్‌లోకి వెళ్ళారు. రూమ్‌లోకి వెళ్ళిన తరువాత అనూష తన స్నేహితురాలిని “ఎందుకు పారిపోయి వచ్చావు.” అని అడిగింది. అందుకు అలేఖ్య “మా అమ్మ ఎంతో కాస్ట్ పెట్టి గాజుతో చేయబడిన దేవదూత బొమ్మను కొనుక్కొని వచ్చింది. వాళ్ళు ఇంట్లో లేని

సమయంలో దానితో నేను ఆడుతూ ఉండగా పగిలిపోయింది. అది తెలిస్తే మా అమ్మ ఏం చేస్తుందో అని భయం వేసింది. పారిపోతుంటే ఎక్కడికి వెళ్ళాలో తెలియక నువ్వు గుర్తుకు వచ్చి నీ దగ్గరకి వచ్చాను.

అప్పుడు అనూష, "నువ్వు నా దగ్గరకి వచ్చినందుకు చాలా సంతోషం" అని చెప్పింది.

ఇంతలో అనూష వాళ్ళ అమ్మ అలేఖ్య! మీ మమ్మీ ఫోన్ అని పిలిచింది. అలేఖ్య భయకంపితురాలై పోయింది. ఫోన్ మాట్లాడటానికి ఎంతో భయపడుతుంది. అనూష, వాళ్ళ అమ్మ ఇద్దరూ కలిసి, బలవంతంగా అలేఖ్యతో ఫోన్ మాట్లాడించారు. ఫోన్‌లో మాట్లాడిన తరువాత "నీ కంటే ఇష్టమైనది ప్రపంచంలో మాకు ఏదీ లేదు అని అన్నారు మా అమ్మా నాన్నా" అని చెప్పింది. "ఇష్టమైన బొమ్మను పగలగొట్టానని, మా అమ్మకి ఎందుకు కోపం రావట్లేదో ఇప్పటికీ అర్థం కావట్లేదు." అని అలేఖ్య అంది.

అప్పుడు అనూష తండ్రి అలేఖ్యతో "నువ్వు తల్లిదండ్రులను సరిగా అర్థం చేసుకోవాలి. మీ అమ్మా, నాన్న నిన్ను ఎంతో ప్రేమిస్తున్నారు. ఎంతగానంటే నిన్ను చూడకుండా ఉండడం కంటే చనిపోవడమే మంచిది అన్నంతగా." అదెలాగో అర్థం కావట్లేదు అన్నట్లుగా చూచింది అలేఖ్య. అది చాలా తేలిక "దేవుడు మనలను ప్రేమించినట్లుగానే పరలోకమందున్న తండ్రి ఎల్లప్పుడు మనము ఆయనతో ఉండడానికి, ఆయనే మన కొరకు సిలువ వేయబడి మన శిక్ష అంతటిని భరించడం జరిగింది." వెంటనే అలేఖ్య "నేను వారిని ఎంతో ప్రేమిస్తున్నాను, వారు ఎప్పటికీ చనిపోకూడదు అని ఎమోషనల్‌గా అంది"

తరువాత వారందరూ కలిసి అలేఖ్య వాళ్ళ ఇంటికి వెళ్ళారు. వాళ్ల అమ్మా, నాన్న పరిగెత్తుకుంటూ వచ్చి గట్టిగా కౌగలించుకున్నారు. వాళ్ళ అమ్మ ఆనందభాష్పాలతో "అలేఖ్య నాకు నిజమైన దేవదూతవలె కనబడుతున్నది. ఎప్పటికి ఎన్నటికి పగిలిపోదు." అని అంది.

తల్లిదండ్రులు మనలను సరిచేసినప్పుడు మనం సంతోషంగా ఉండాలి కాని మనం భయపడి పారిపోవడం అబద్ధాలు చెప్పడం చేయకూడదు. వారు మనలను ఎంతో ప్రేమిస్తూఉంటారు.

చూశారా పిల్లలూ! మన పట్ల తల్లిదండ్రులు చూపిస్తున్న ప్రేమ ఇంత గొప్పదై ఉంటే తల్లిదండ్రులకు, మనకి కూడా తండ్రియైన దేవుడు ఇంకెంతగా ప్రేమిస్తున్నాడో మనం అర్థంచేసుకోవాలి.

– మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు"

- పీటర్


మన ప్రభువును, రక్షకుడునైన యేసుక్రీస్తు నామములో స్పర్శ పాఠకులైన మీ అందరికి నా వందనములు. నేను జీ.భీమనపల్లి అనే గ్రామములో జన్మించడం జరిగింది. నల్గొండ జిల్లా, పెద్ద అడిశ్వరపల్లి మండలంలో ఈ ప్రాంతం ఉంటుంది. నా ప్రవర్తన చిన్నతనము నుండి గర్వముతో నిండి ఉండేది. బాల్యములోనే పొగత్రాగుతూ, సినిమాలు చూచుకుంటూ అల్లరి చిల్లరగా తిరిగేవాడిని. ఒకరోజు మామయ్య వాళ్ళ ఊరికి వెళ్ళాను. ఆ ఊరి చర్చిలో ప్రార్థన జరుగుతుంది. నేను కూడా వెళ్ళాను. అక్కడ డబ్బులు ఇచ్చిన వారికే ప్రార్థన చేయడం చూశాను. నా దగ్గర కొన్ని డబ్బులు ఉంటే, ఇచ్చి ప్రార్థన చేయించుకున్నాను.

దినములు జరుగుచున్న కొలదీ నా ప్రవర్తన వలన మా తల్లిదండ్రులు విరక్తి చెందారు. చదువు మానివేశాను. నా బ్రతుకు మురికి గుంటలా తయారయ్యింది. వివాహమైనా చేస్తే, మారతానేమోనని వివాహం చేశారు. వివాహం అయిన తరువాత నేను, నా భార్య హైదరాబాద్‌కు వచ్చాము. జీడిమెట్ల ప్రాంతంలో ఒక ప్రైవేట్ కంపెనీలో పనికి వెళ్ళేవాడిని. ఆ సమయంలో నా గురించి నేను ఆలోచిస్తే, శాంతి, సమాధానములు లేక దేవుళ్ళందరూ ఒకటే అని అందర్నీ ఆరాధించేవాడిని, కానీ ఏం ప్రయోజనము లేదు. చేస్తున్న పనిని మానివేసాను, ఇంట్లో తినడానికి ఆహారం కూడా లేదు. ఎల్.బి.నగర్ ప్రాంతమునకు వచ్చాము. అక్కడ కూడా పని లేదు. మూడు నెలలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాము. ఒకరోజు తెలిసిన వ్యక్తి ఒకరు వచ్చి, నేను రామోజి ఫిల్మ్ సిటీలో పనిచేస్తున్నాను, నువ్వు కూడా నాతో రా అన్నాడు. నేను వెళ్ళాను, ఫిల్మ్‌సిటీలో ఒక ఉద్యోగం ఇప్పించాడు. అప్పుడు ఎల్.బి.నగర్ నుండి ఫిల్మ్‌సిటీ దగ్గరకు ఒక అద్దె ఇంటికి మారాము. ఆ ఇంటి వారు నాలుగు రోజుల తరువాత మీది ఏ కులం అని అడిగారు. నేను చెప్పినప్పుడు వెంటనే ఇల్లు ఖాళీ చేయించారు. ఈ కులంలో పుట్టడం తప్పా అని మేము బాధపడ్డాము. ఇంకేం చేయాలో తెలియక ఒక గుడిసె వేసుకొని ఉంటున్నాము. ఒకరోజు రాత్రి దేవుని పాటలు వినిపిస్తుండగా, ఎక్కడా అని వెతుక్కుంటూ వెళ్ళాము. చిన్న పాకలో ప్రార్థన జరుపుకుంటున్నారు. ప్రార్థన అయిపోయిన తరువాత అక్కడి సహోదరులు మమ్ములను పలకరించి, రేపు కూడా ప్రార్థన జరుగుతుంది అని చెప్పారు. ఆదివారం ప్రార్థనకు వెళ్ళాము, డబ్బులు అడుగుతారేమోనని భయం వేసింది. కానీ అక్కడ ఎవ్వరూ అడగలేదు. అలా ప్రార్థనకు వస్తూ ఉండగా, నాకు ఉన్న త్రాగుడు, బీడీల వ్యసనము నుండి ఒకదినము విడుదల పొందడం జరిగింది. మారుమనస్సు పొంది, పాపములను ఒప్పుకొని, క్రొత్త జన్మ అనుభవం లోనికి నడిపించబడ్డాను. డిసెంబర్, 2003వ సం॥లో బాప్తిస్మం పొందాను. అప్పటి నుండి ఎన్నో అద్భుతములతో దేవుడు మమ్ములను నడిపిస్తున్నారు.

ఒకరోజు మా కుమారుడు క్రిందపడి, ఊపిరి అందకుండా ఉండిపోయాడు. చుట్టుప్రక్కల వారు చనిపోయాడు అన్నారు. దేవుడు ఇచ్చాడు, దేవుడే తీసుకుంటాడు అని నూనె వ్రాసి, ప్రార్థన చేసాము. అరగంట తరువాత మరల శ్వాస తీసుకోవడం ప్రారంభించాడు. ఎంతో అద్భుతం. నా తల్లి కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది. డాక్టర్లు పెద్ద ఆపరేషన్ చేయాలి అన్నారు. చేయించడానికి నా దగ్గర డబ్బులు లేవు. ప్రత్యేక ఉపవాస ప్రార్థనకు తీసుకువచ్చాను. దేవుడు ముట్టి స్వస్థపరిచారు. డబ్బులు వచ్చిన తరువాత హాస్పిటల్‌కి తీసుకువెళ్తే ఆపరేషన్ అక్కర్లేదు అని చెప్పారు.

నేను చేస్తున్న ఉద్యోగంలో ఒక సంవత్సరం 6 నెలల తరువాత ప్రమోషన్ ఇచ్చారు. ఇచ్చిన వారం రోజులకు ఆదివారం సెలవు ఇవ్వము అన్నారు. అప్పుడు నేను, నాకు ప్రమోషన్ అవసరం లేదు, ఆదివారం సెలవు కావాలి అన్నాను. ప్రమోషన్ ఆపివేశారు. ఏమైందో తెలియదు కానీ నెలరోజుల తరువాత మేనేజ్‌మెంట్ వారు మరల పిలిచి, ప్రమోషన్‌తో పాటు ఆదివారం సెలవు కూడా ఇచ్చారు. దేవుడే వారి హృదయంలో కార్యం చేశారని నేను విశ్వసించుచున్నాను.

నన్ను, నా భార్యను రక్షించి, అంత మాత్రమే కాకుండా మా కుటుంబములో ప్రతి అవసరతను తీరుస్తూ, నా వ్యసనములన్నిటిని విడిపించి, మురికిగుంట లాంటి నా బ్రతుకుని, నేడు అనేకులకు సువాసనగా మార్చిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు. పరిచర్యలో నా తోటి సహోదర, సహోదరీలు చూపించే క్రీస్తు ప్రేమ మధురమైన అనుభూతి. నేను బ్రదుకు దినములన్నియూ దేవుని మందిరములో దేవుడు ఉద్దేశించిన పాత్రగా వాడబడాలని ప్రార్థన చేయండి.



# నిజమైన స్నేహితులు

విలియం అను ఒక యౌవనుడు, అతనికి కలిగియున్న క్యాన్సర్ వ్యాధిని బట్టి ఒక పెద్ద హాస్పిటల్‌లో చేర్పించబడ్డాడు. వైద్యుల సలహా మేరకు రేడియేషన్ మరియు కీమోథెరపీ అనే చికిత్సా విధానములతో అతనికి వైద్యం అందిస్తున్నారు. దాని వలన అతని తలవెంట్రుకలన్నీ రాలిపోవడం జరిగింది. హాస్పిటల్ నుండి ఇంటికి వెళ్తున్న సమయంలో అతను ఎంతో ఆందోళనతో ఉన్నాడు. కారణం అతను కలిగియున్న వ్యాధి కంటే, తలవెంట్రుకలు లేకుండా స్కూల్‌కి ఎలా వెళ్ళాలి అని ఆలోచిస్తున్నాడు. అతను ఇంటికి వచ్చి, నడుచుకుంటూ లోపలికి వెళ్ళేసరికి, సుమారు 50 మంది స్నేహితులు గొంతుతూ ఇలా అరుస్తున్నారు. Welcome Home (ఇంటికి స్వాగతం) ఆ పిల్లవాడు చుట్టూ చూచి నమ్మలేని నిజంతో నిశ్చేష్టుడయ్యాడు. ఎందుకనగా తాను చూచుచున్నది కలో, నిజమో అర్థము కాలేదు. కారణం వాళ్ళందరూ కూడా తలమీద ఒక్క వెంట్రుకైనా లేకుండా షేవ్ చేయించుకొని ఉన్నారు.

చూశారా! అ స్నేహితులు తమలో ఒకడిగా ఉన్న వ్యక్తి కొరకు ఎలాంటి త్యాగం చేశారో. ఈ దినములలో లోకంలో ఇలాంటి స్నేహం దొరకడం అరుదు. మనము క్రైస్తవులమైన తరువాత మన యెడల ప్రేమ, త్యాగము కనపరిచే కుటుంబములో ప్రవేశించాము అని గ్రహించాలి. బైబిల్ గ్రంథము **1 కొరింథీ 12వ అధ్యాయములో** ఇలా వ్రాయబడి ఉన్నది. **సంఘము అనే క్రీస్తు శరీరములో ఒక అవయవము శ్రమపడిన యెడల, అవయవములన్నీ శ్రమపడుననియు, ఒక అవయవము సంతోషించిన యెడల అవయవములన్నీ సంతోషించును. అనగా మనము కలసి శ్రమపడుచున్నాము, కలసి సంతోషించుచున్నాము.** ఇలాంటిదే నిజమైన సంఘము, కుటుంబము లేక స్నేహము అనవచ్చును.

ఈ విధముగా మనము ప్రవర్తించుట లేక పనిచేయుట దేవుడు మన యెడల చేసిన కార్యమే. యేసు మనలను ఎంతగా ప్రేమించాడంటే, తల వెంట్రుకలు తీయించుకొనుట కంటే ఎక్కువగా అనగా మన కొరకు సిలువ మ్రానుపై వ్రేలాడి, తన జీవితమును మన కొరకు ఇచ్చినంతగా. తన స్నేహితుల కొరకు ప్రాణము పెట్టువానికంటే ఎక్కువైన ప్రేమగలవాడు ఎవడును లేదు. **(యోహాను 15:13)**

# ఆత్మ ఫలము - 11వ భాగము




**అయితే ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము.**

**ఆత్మఫలములో ఎనిమిదవది సాత్వికము.**

సాత్వికము అనగా సాధుగుణము. సాధుగుణము అంటే బలహీనత కాదు, నిజానికి ఇది గొప్ప ఆత్మ బలము. ఆత్మఫలములో భాగమైయున్న సాత్వికము అనే గుణము గురించి ఆలోచించినప్పుడు మనము చాలా సాత్వికులము అని అనిపిస్తూ ఉంటుంది. ఏ పని, ఏ మాటా లేనంతవరకు ప్రతి వ్యక్తి నేను సాత్వికుడనే అనే భావముతో ఉంటాడు. మనము చిక్కులలో పడినప్పుడు, ఇబ్బందులలో నలుగుతున్నప్పుడు మనలోని భావోద్రేకములు ఉవ్వెత్తున ఎగిసిపడతాయి. అప్పుడు మనం ఎంత సాధు గుణముతో ఉంటున్నామో మనకి తెలుస్తుంది.

దేవుడు మనలను ఎలాంటి పరిస్థితులలోనికి నడిపించిననూ, వాటిని వినయముతో అంగీకరించడమే సాధుగుణము. దేవుని కోసం బాధని అనుభవించడానికి సమ్మతించడం, హేళన మరియు తిరస్కారముల పాలైననూ కోపం, ప్రతికారం చూపకుండా ఉండడానికి సిద్ధపడడమే సాధుగుణం. సాత్వికము మనలను క్రీస్తు నుండి నేర్చుకోవాలి అనే దీనత్వమును కలిగిస్తుంది. ఎందుకనగా ఇది ప్రభువైన క్రీస్తు యొక్క లక్షణం గనుక. సాత్వికులుగా జీవించేవారు ఆధ్యాత్మికంగా బలవంతులై దేవుని పనిలో ప్రయోజనకరమైన పాత్రలుగా ఉంటారు. అందుకే సాత్వికులు ధన్యులు వారు భూలోకమును స్వతంత్రించు కొందురు అని వ్రాయబడి ఉంది.  దేవుడు ఎంత ఆధిక్యతను కలుగజేశాడు!. సాత్వికము లేక సాధుగుణము మనము కలిగియుండుటకు పరిశుద్ధాత్మ దేవుని సహాయము ఎంతో అవసరము. పరిశుద్ధాత్మ దేవుని సహాయము ఆయనకు విధేయులగుట ద్వారా మనము పొందగలము. కావున మనము దేవునికి విధేయులమై, ఆత్మసహాయము వలన సాధుగుణము గలవారమై జీవిద్దాము.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక !



# మార్టిన్ లూథర్-2

తరువాత లూథర్ మఠములో చేరి ఆత్మరక్షణ పొందుటకును, దేవునితో సమాధానపడుటకును వాంఛించెను. ఆయన తల్లియైన మరియకే ఎక్కువ ప్రార్థనలు చేయవలెనని, అన్నిటి కంటే దేవునికి మహా ఇష్టమైన బలి యేమనగా లోకమును వదిలి ఒక సాధువు అగుటయే అను బోధలు మార్టిన్ మనస్సులోనికి లోతుగా దిగిపోయెను. రాత్రులు తన పాపములు క్షమించబడలేదనే తలంపు నిద్రపట్టనిచ్చేది కాదు. పాపములు క్షమించబడినవి అను నిశ్చయత దొరికితే ఎంత బావుండును అనే వాంఛ లూథర్‌ను ఎంతో బాధించెను. లూథర్ ఒకవైపు బోధించుచు, మరోవైపు బైబిల్ పరిశీలన ఇంకా లోతుగా జరిగించుచు, సంఘనాయకుల సందేశముల కంటె బైబిలు నందే దేవుని మర్మములు దాచబడియున్నాయని గుర్తించెను.

1514 వ సం॥లో ఒక దినము బైబిల్ గ్రంథములో రోమా పత్రిక 1:16,17లోని వచనములను ధ్యానించుట ద్వారా దేవుని పరిశుద్ధ నీతిని నెరవేర్చిన క్రీస్తు నా స్థానమున మరణించి, నా పాప శిక్షను భరించెను అని తెలుసుకున్నాడు. క్రీస్తు నాకై మరణించెనని విశ్వసించిన యెడల క్రీస్తు యొక్క నీతి నాదగును అనే ఆలోచన ద్వారా లూథర్ రక్షణానుభవము పొందెను. లూథర్ మీద ప్రకాశించిన ఈ వెలుగు ఒక చిన్న నిప్పురవ్వగా ప్రారంభమై, ఆర్పలేని మహా మంటగా అతి శీఘ్రముగా వ్యాపించినది.

పాపనివారణ పత్రముల ద్వారా పాపములు క్షమించబడవు, బోధించుచున్న పోప్‌ల బోధలను తప్పు అని ఖండించి, మన కొరకు శిక్షను యేసుక్రీస్తు పొందాడు అనే బోధల ద్వారా అనేకుల ఆగ్రహమునకు గురి అయ్యాడు లూథర్. లూథర్ మీద దేశద్రోహి అని అతను కంటబడితే బంధించవలెను (లేదా) చంపవలెను అని చక్రవర్తి సంతకముతో అమోదించబడిన శిక్షాపత్రము లూథర్ కొరకు సిద్ధమైంది. అయినను లూథర్ విడువక, ఖండించుచు బోధించిన బోధల ద్వారా పోపులను అనుసరించిన కొందరు క్యాథలిక్స్ గా లూథర్‌ని అనుసరించిన కొందరు ప్రొటెస్టంట్స్‌గా రెండు వర్గములు ఏర్పడిరి.

ఈ విధంగా లూథర్ ఎంతో పోరాడి, మతగురువుల అక్రమాలను, ఆగడాలను అరికట్టి సంఘ చరిత్రలో పెనుమార్పులను తీసుకువచ్చి 1546 ఫిబ్రవరి 18, తెల్లవారి 3 గంటల సమయమందు తన 62 సం॥ల వయస్సులో చివరి శ్వాసను విడిచెను.

వాక్యమను రెండంచుల వాడియైన ఖడ్గముతో మాత్రమే తన విరోధులతో పోరాడిన వాడు మార్టిన్ లూథర్ . ఆయన జననము సాధారణమైనదే కానీ, ఖ్యాతి దేశదేశములకు వ్యాపించింది.

# క్రిస్మస్ కానుక

ఈ భూగోళం మీద ఉన్న సమస్త మానవాళి చరిత్రను రెండు భాగాలు (క్రీస్తుపూర్వం, క్రీస్తుశకం)గా చేసిన ఆరోజు, మన క్యాలెండర్‌లలో, కంప్యూటర్లలో కనిపించే తేదీలకు ఆధారమైన ఆరోజు క్రీస్తు యేసు పుట్టినరోజు. అసమానుడైన క్రీస్తు పుట్టిన ఆరోజును ప్రపంచమంతా పండుగగా ఆచరిస్తుంది. అయితే యేసుక్రీస్తు పుట్టుక ద్వారా ప్రతి మనిషికి దేవుడు సిద్ధపరచిన అమూల్యమైన బహుమానమును అనేక మంది గుర్తించలేకపోతున్నారు.

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ లోకానికి రావడానికి గల కారణం ఏమిటో ఈ చిన్న ఉపమానం ద్వారా సులభంగా అర్థమవుతుంది. ఒకరోజు ఒక తండ్రి 7 సంవత్సరాల కుమారుడితో కాలువ గట్టున కూర్చుని ఉన్నాడు. ఆ కుమారుడు కాలువ ఒడ్డు అంచున ఉన్న చీమలగుంపును గమనిస్తూ ఆనందిస్తున్నాడు. నీటి ప్రవాహం పెరుగుతూ ఉండటంతో ఆ చీమలు నీటిలో పడి కొట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది. ఆ బాలుడు వాటి స్థితి చూసి చాలా బాధపడుతూ ఒడ్డుకు వచ్చేయండి లేకపోతే కొట్టుకుపోతారు అని అరుస్తున్నాడు. చీమలకు వినబడాలని ఎంత అరిచినా ఫలితం శూన్యం. అప్పుడు తండ్రి కుమారునితో ఇలా అన్నాడు. "నువ్వు ఎంత అరిచి బాధపడినా ప్రయోజనం లేదు. చీమలు నీ భాష అర్థం చేసుకోలేవు. నీవు చీమగా మారితే వింటాయి. అప్పుడు కుమారుడు నేను చీమగా మారి వాటిని రక్షిస్తాను అన్నాడు. వాటిని రక్షించుకోవాలనే తపనతో ఆ బాలుడు అమాయకంగా మాట్లాడినా, సరిగ్గా అటువంటి నిష్కళ్మషమైన, నిస్వార్థమైన ప్రేమ దేవుని కుమారుడైన యేసును రక్తమాంసములు కలిగిన మనుష్యునిగా మన మధ్య జన్మింపచేసింది. దేవుడు మన భయాలను పోగొట్టి మన ఆత్మను విడిపించాలని తన సొంత కుమారుడిని మన కోసం మన మధ్యకు పంపించాడు. కన్య మరియ పరిశుద్ధాత్మ వలన గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరు పెట్టింది. తండ్రి అయిన దేవుడు నీ యొక్క జన్మ, కర్మ పాపములను సిలువలో తన కుమారుని మీద మోపి మనలకు విమోచనను సిద్ధపరిచాడు.

యేసు జన్మ పునీతమైనది, ఆయన గుణము సాటిలేనిది, ఆయన జీవితము విశిష్టమైనది. యేసు జన్మించుటకు 700 సం.ల పూర్వమే ఆయన జన్మించే విధానం, జన్మస్థలం, సిలువ మరణము మరియు పునరుత్థానము గురించి దేవుడు స్పష్టమైన వివరాలను తన భక్తులద్వారా గ్రంథస్థం చేయించాడు. యేసును మించిన కారణజన్ములు ప్రపంచ చరిత్రలో మరెవ్వరులేరు, ఇక ఉండబోరు. నీ జీవితానికి జవాబు అయి ఉన్న యేసును, అమూల్యమైన క్రిస్మస్ బహుమానముగా దేవుడు నీ కొరకు పంపించాడు. దేవుని యొక్క బహుమానమును నీవు స్వీకరించి దేవుని దీవెనలను పొందుకొనగలవు.





# కర్మేలు పర్వతం

కర్మేలు పర్వతం గలిలయకును, సమరయకును పశ్చిమ దిక్కున హద్దుగా ఉన్నది. ఈ కొండలు 1746 అడుగుల ఎత్తుగాను, వాటి వరుస 15 మైళ్ళ పొడుగుగా ఉండును. అది అక్కాయను సంయుక్తా గ్రగుడమునకు దక్షిణముగా సముద్రము వరకు వ్యాపించి, అచ్చట 556 అడుగుల ఎత్తుగా ఉండును. దానిలో గుహలు ఉండుటచే అది ప్రవక్తల ఆశ్రమములకు తగిన స్థానమై ఉండెను. కర్మేలు అనగా తోట, వనము అని అర్థము. పరమగీతములో కర్మేలు శిఖరము ఒక స్త్రీ శిరస్సుతో పోల్చబడి యున్నది కావున అది మిగుల సొగసైనదై యుండునని తెలిసికొనవచ్చును.

ఇశ్రాయేలు ప్రజల మొట్టమొదటి రాజైన సౌలు అమాలేకీయులను జయించిన తరువాత ఇచ్చట జయసూచకమైన ఒక శిలను నిలిపెను. ఈ పర్వతం మీదే ఏలియా ప్రవక్త 450 మంది బయలు ప్రవక్తలను, ఇశ్రాయేలు వారందరిని సమకూర్చి రెండు తలంపుల మధ్య మీరెందుకు, యెన్నాళ్ళ మట్టుకు తడబడుచుందురు? యెహోవా దేవుడైతే ఆయనను అనుసరించుడి, బయలు దేవుడైతే వానిని అనుసరించుడి. అని వారి యెదుట యెహోవానే దేవుడని ఋజువు చేసి, బయలు ప్రవక్తలని ఓడించెను.

ఇశ్రాయేలు రాజ్యములో 3 సం॥లు వర్షము లేనప్పుడు, 3వ సం॥ మందు దేవుని వాక్కు ప్రకారము ఏలియా సేవకుడు వర్షము యొక్క సూచనను కర్మేలు కొండ మీద నుండే గమనించి, చిన్న మేఘము సముద్రము నుండి పైకి ఎక్కుచున్నదని చెప్పెను.

ఏలియా శిష్యుడైన ఎలీషా, ఏలియా సుడిగాలిచేత ఆకాశమునకు ఆరోహణమైన తరువాత  కర్మేలు పర్వతమునకు వచ్చెను. షూనేము పట్టణమందు ఎలీషాకు ఆతిథ్యమిచ్చిన షూనేమీయురాలి యొక్క కుమారుడిని కర్మేలు పర్వతం మీద ఉన్న ఎలీషా ప్రవక్త యొద్దకు తీసుకొనిరాగా, ఎలీషా ప్రవక్త ఆ కుమారుడిని బ్రతికించెను.

కర్మేలు పర్వతం నేటి వరకు పరిశుద్ధంగా ఎంచబడుచున్నది.




# బైబిల్ క్విజ్ -13

(పాత నిబంధనా గ్రంథంలో
31-35 పుస్తకములలో నుండి ఇవ్వబడినవి)

**ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయుడి.**

**1.** **నరహత్య చేయుట చేత ఎవరికి శ్రమ, దుష్టత్వము జరిగించుటచేత ఎవరికి శ్రమ?**

**2.** **నీనెవె పాడైపోయెనే దాని కొరకు అంగలార్చు వారెవరు?**

**3.** **నేనిక బ్రతుకుట కంటె చచ్చుట మేలు అని ఎవరు ఎవరితో అన్నారు?**

**4.** **నీ సహోదరుని శ్రమానుభవదినము చూచి నీవు ఆనందమొంద తగదు. రిఫరెన్సు?**

**5.** **ధర్మశాస్త్రమును, యెహోవా వాక్కును వేటిలో నుండి బయలు వెళ్ళును?**

**6.** **ఎవరి యొద్దనే రక్షణ దొరుకునని ఎవరు ప్రార్థించారు?**

**7.** **నీ కనుదృష్టి దుష్టత్వము చూడలేనంత నిష్కళంకమైనది గదా. రిఫరెన్సు?**

**8.** **లంచము పుచ్చుకొని తీర్పు తీర్చువారు ఎవరు? కూలీకి బోధించువారు ఎవరు?**

**9.** **నిన్ను గూర్చిన వార్త విని భయపడుచున్నాను అని ఎవరు ఎవరితో అన్నారు?**

**10.** **యెహోవాకు పాదధూళిగా ఉన్నవి ఏవి?**

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు డిసెంబర్ 15 తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జనవరి,2011 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 12 జవాబులు :**

**1.** యోవేలు 1:8

**2.** దానియేలు 8:3; షూషనను పట్టణపు నగరులో

**3.** యెహెజ్కేలు 24:17

**4.** హోషేయ 1:6; జాలినొందనిది

**5.** ఆమోసు 5:15; న్యాయము

**6.** యోవేలు 3:10

**7.** ఆమోసు **7**:14; ఆమోసు, అమజ్యాతో

**8.** యెహెజ్కేలు 34:2

**9.** హోషేయ 6:8; గిలాదు

**10.** దానియేలు 6:1; 120 మంది

**బైబిల్ క్విజ్ - 12 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

శాంతి, కె.పద్మ, కె.అనిత కుమారి, కె.వసంతరాణి సాగర్, జి.శ్యామ్‌ప్రసాద్, సి.హెచ్.పాల్‌రాజ్, జె.రాజ్యం, సౌజన్య, ఎమ్.విజయ, పి.ప్రసన్న ప్రశాంత్, సి.హెచ్.జానకి

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## నవంబర్ - డిసెంబర్

**భాగ్యలత** : సుధారాణి, హెప్సిబా, మణి, మేఘన, రాధిక, ప్రజ్ఞ, ప్రవీణ్, ప్రవల్లిక, అభిషేక్, కనికరమ్మ, రూప, థామస్, రమేష్, తర్షీనా, రాజ్‌కుమార్, సతీష్‌బాబు, అమూల్య, చంద్రశేఖర్, పుష్పలత, రాధిక, లూధియా, సతీష్, నవీన్, కరుణ, కృష్ణవేణి, ప్రవీణ్, ఆశీర్వాదమ్మ, దివ్యజ్యోతి, అనిష్‌ప్రసాద్, ఫిన్నినోయల్.

**చింతల్** : రాజ్‌కిరణ్, శశాంక్, మార్గరేట్, దానియేల్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సుహాసిని, కుమారి, పావని, దానియేలు, దివ్యజ్యోతి, సాల్మన్, ఎస్తేరు రాణి, మంజుల, లక్ష్మారెడ్డి.

**అనాజ్‌పూర్** : థామస్ పీటర్, నీలిమ, కిరణ్, స్వాతి, కృపావరం, హేమలత, రూతు, శ్రీకాంత్.

**ఇ.సి.ఐ.యల్** : ప్రేమ్‌కుమార్.

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

మీ ప్రార్థనావసరతలు:

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227

ది. 02.10.2010 న జరిగిన ఉపవాస ప్రార్థనలో అనేకులు ఆసక్తితో పాల్గొని దేవునిని ప్రార్థించడం జరిగినది. ఈ ఉపవాస ప్రార్థనలో **"ఒక్కడినై"** ఆధ్యాత్మిక పాటల సిడి విడుదలతో పాటు ఎపఫ్రా మినిస్ట్రీస్ వెబ్ సైట్ www.epaphra.org ప్రారంభించడం జరిగినది.







ది. 3.10.2010 న మందిరమును విశాల పరచుటలో భాగంగా నూతనంగా కట్టబడిన ఫ్లోర్ ప్రతిష్ట చేయడం జరిగింది.



# ఎపఫ్రా మినిస్ట్రీస్


ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070
Ph: 040-24202227 email: mail2church@gmail.com
web: www.epaphra.org